క్లుప్తంగా

నార్కట్‌పల్లి ఎస్‌ఐగా సైదాబాబు



నార్కట్‌పల్లి : నార్కట్‌పల్లి ఎస్‌ఐగా దొంగరి సైదాబాబు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఇక్కడ విధులు నిర్వర్తించిన ఎస్‌ఐ బొడిగే రామకృష్ణ నల్లగొండ డీఎస్‌బీకి బదిలీపై వెళ్లారు.

మర్రిగూడ ఎస్‌ఐగా రంగారెడ్డి



మర్రిగూడ : మర్రిగూడ మండల నూతన ఎస్‌ఐగా కె.రంగారెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన నకిరేకల్ మండలం నుంచి బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేసిన ఎస్‌ఐ హరీశ్‌రెడ్డి నల్లగొండ ఎస్పీ కార్యాలయానికి అటాచ్ అయ్యారు.

రుణమాఫీ చేయాలి

నల్లగొండ టౌన్ : రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం రైతులకు లక్ష లోపు రుణాలను ఏకకాలంలో మాఫీ చేయాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పాశం నరేష్‌రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

నేడు అఖిలపక్ష సమావేశం

మునుగోడు : మండలంలోని కిష్టాపురం గ్రామంలో ఫార్మా కంపెనీ పనులను నిలిపివేసేందుకు చేపట్టాల్సిన కార్యక్రమాలపై గురువారం అఖిలపక్ష పార్టీల సమావేశం నిర్వహించనున్నట్లు ఫార్మా వ్యతిరేక కమిటీ కన్వీనర్ భీమనపల్లి సైదులు తెలిపారు. జమస్థాన్‌పల్లి క్రాస్ రోడ్డు వద్ద గల ఫంక్షన్ హాల్‌లో నిర్వహించనున్న సమావేశానికి మండలంలోని అన్ని పార్టీల ప్రజాప్రతినిధులు, నాయకులు, సామాజిక ఉద్యమకారులు హాజరుకావాలని కోరారు.

ఉచిత వైద్యశిబిరం

రామగిరి(నల్లగొండ): నల్లగొండ పట్టణంలోని శాంతి మహిళా వృద్ధుల అనాథాశ్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా లీగల్ సెల్ సెక్రటరీ జడ్జీ బి.దీప్తి ఆశ్రమంలోని వృద్ధులకు పలు చట్టాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సి.శ్రీవాణి, గాయత్రి, టి.లావణ్య, ఎల్.యోగానంద తదితరులు పాల్గొన్నారు.

నేడు బీజేపీ బైక్ ర్యాలీ

నల్లగొండ టూటౌన్ : డాక్టర్ బీఆర్ అంబేద్కర్ 132వ జయంతిని పురస్కరించుకొని నల్లగొండ పట్టణంలో గురువారం భారీ బైక్ ర్యాలీ నిర్వహించనున్నట్లు బీజేపీ పట్టణ అధ్యక్షుడు మొరిశెట్టి నాగేశ్వర్‌రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 4 గంటలకు బీజేపీ కార్యాలయం నుంచి మర్రిగూడ బైపాస్ వరకు బైక్ ర్యాలీ ఉంటుందని, పార్టీ కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

కవి ప్రకాష్‌కు సన్మానం

చిట్యాల : డాక్టర్ బీఆర్. అంబేద్కర్ జయంతి సందర్భంగా చిట్యాల శాఖా గ్రంథాలయం ఆధ్వర్యంలో బుధవారం కవి మిర్యాల ప్రకాష్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి సందినేని అనిల్‌కుమార్, గ్రంథాలయ అధ్యక్షుడు దాసరి నర్సింహ, నాయకులు జిట్ట చంద్రకాంత్, ఘంట శ్రీనివాస్‌రెడ్డి, జయారపు శివప్రసాద్, ఆవుల ఆనంద్, సిలివేరు యాదగిరి, వెలిమినేటి రవీందర్‌రెడ్డి, రెముడాల మధు, శంకర్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నేడు ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

కనగల్ : మండల పరిధిలోని పలు గ్రామాల్లో నేడు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి ప్రారంభిస్తారని బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు అయితగోని యాదయ్యగౌడ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. చర్లగౌరారం, దర్వేశిపురం, పర్వతగిరి, లచ్చుగూడెం, తుర్కపల్లి, ఎం గౌరారం, కనగల్ పీఏసీఎస్, తిమ్మన్నగూడెం, ఎస్ లింగోటం, చెట్లచెన్నారం, తేలకంటిగూడెం గ్రామాల్లో కేంద్రాలను ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు.

మృతుల కుటుంబాలకు రూ.20 లక్షలు ఇవ్వాలి

చండూరు : మండలంలోని దోనిపాముల గ్రామంలో మృతి చెందిన ఉపాధి హామీ కూలీల కుటుంబాలకు రూ.20 లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందించాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి నారి ఐలయ్య ప్రభుత్వాన్ని కోరారు. దోనిపాముల గ్రామంలో ప్రమాదవశాత్తు చెరువులో జారిపడి మృతి చెందిన చిలకరాజు లింగమ్మ (60), సూర లక్ష్మమ్మ (62)మృతదేహాలను బుధవారం జిల్లా కేంద్ర ఆస్పత్రిలో సందర్శించారు. ఆయన వెంట జిల్లా మహిళా కూలీల కన్వీనర్ దండంపల్లి సరోజ, జిల్లా సహాయ కార్యదర్శి మన్నెం భిక్షం, జిల్లా కమిటీ సభ్యులు గణమల్ల రాములు, బొమ్మరగాని కిరణ్, దోనిపాముల సర్పంచ్ తిప్పర్తి దేవేందర్, దాసరి స్వామి పాల్గొన్నారు.

'కంటి వెలుగు' ప్రారంభం

నార్కట్‌పల్లి : మండలంలోని నక్కలపల్లి గ్రామంలో కంటి వెలుగు శిబిరాన్ని సర్పంచ్ ఈద మాధవినర్సింహ గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ అంజయ్య, అక్కెనపల్లి పీహెచ్‌సీ డాక్టర్ శ్రీనివాస్, బాషపాక రవి, మాజీ ఎంపీటీసీ సత్తయ్య, అంగన్‌వాడీ టీచర్ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా పాత బావులు



రాంరెడ్డిపల్లి సమీపంలో ఉన్న పెద్ద బావి



శివన్నగూడ ప్రైమరీ స్కూల్ సమీపంలో గల బావి

- బావుల సమీపంలో సూచిక బోర్డులు, రక్షణ వలయాలు కరువు
- నిరుపయోగంగా ఉన్నవాటిని పూడ్చివేయాలని ప్రజల వినతి

మర్రిగూడ : గ్రామీణ ప్రాంతాల్లో నాడు వ్యవసాయం చేయడానికి తవ్విన బావులు ప్రస్తుతం నీరు లేకపోవడంతో అనేక చోట్ల నిరుపయోగంగా మారాయి. రోడ్డు వెంట ఉండి ఉపయోగంలో ఉన్న వాటికి రక్షణ వలయాలు, సమీపంలో సూచిక బోర్డులు లేకుండా పోయాయి. దీంతో ప్రయాణికులు, వాహనదారులు, ఆ దారుల గుండా వెళ్లాలంటే జంకుతున్నారు. మర్రిగూడ మండల పరిధిలోని పలు గ్రామాల్లో రోడ్డుకు సమీపంలో పాత బావులు ఉన్నాయి. ఉపయోగంలో ఉన్నవి తక్కువ, నిరుపయోగంలో ఉన్నవి ఎక్కువ.

మూలమలుపుల వద్ద బావులు..

మర్రిగూడ నుంచి కొండూరు దారిలో, యరగండ్లపల్లి నుంచి తిరగండ్లపల్లి గ్రామాల మధ్య, మర్రిగూడ నుంచి తూర్పుతండా వెళ్లే దారిలో, మర్రిగూడ నుంచి కిష్టరాయినిపల్లికి వెళ్లే దారిలో, రాంరెడ్డిపల్లి నుంచి తాందార్‌పల్లికి వెళ్లే దారిలో, మర్రిగూడ నుంచి చర్లగూడెం వెళ్లే దారిలో, సరంపేట నుంచి ఇందుర్తికి వెళ్లే దారిలో, శివన్నగూడ నుంచి ఇందుర్తికి వెళ్లే దారిలో, శివన్నగూడ నుంచి నర్సిరెడ్డిగూడెంకు వెళ్లే దారిలో, శివన్నగూడ నుంచి అంతంపేటకు వెళ్లే దారిలో పాత బావులు రోడ్డు పక్కనే ప్రమాదకరంగా ఉన్నాయి. మండల వ్యాప్తంగా 15 నుంచి 20 వరకు దారి సమీపంలో, మూలమలుపుల వద్ద ప్రమాదకరంగా బావులు ఉన్నాయి. అందులో 75శాతం నిరుపయోగంగా ఉన్నాయి.

బావుల్లో నుంచి దుర్వాసన

శివన్నగూడ ప్రైమరీ స్కూల్ సమీపంలో దారికి ఇరువైపులా పాత బావులు ఉన్నాయి. పాఠశాలలో 144 మంది విద్యార్థులు ఉన్నారు. ఆ విద్యార్థులు బహిరంగ ప్రదేశంలో మలమూత్ర విసర్జనకు వెళ్తున్నారు. బావులకు కంచె ఏర్పాటు చేయకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తిరగండ్లపల్లి-యరగండ్లపల్లి గ్రామాల మధ్య మూలమలుపు వద్ద అనేక ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. దీంతో ఆ బావికి తాత్కాలిక రక్షణ వలయం ఏర్పాటు చేశారు. మర్రిగూడ నుంచి చర్లగూడెంకు వెళ్లే దారిలో గల పాత బావిలో మండలానికి చెందిన ఓ వ్యక్తి గతంలో తన భార్యను హత మార్చి బావిలో పడవేయగా కొన్ని సంవత్సరాల తరువాత సంఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. ఇరు గ్రామాల మధ్య ఉండడంతో మూగ జీవాల కళేబరాలను, వ్యర్థాలను ఈ బావుల్లో పడవేయడంతో దుర్వాసన వెదజల్లుతున్నట్లు సమీప పొలాల రైతులు ఆరోపిస్తున్నారు. ఉపయోగంలో ఉన్న వాటికి రక్షణ వలయాలు, హెచ్చరిక బోర్డు, సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని, నిరుపయోగంగా ఉన్న బావులను తక్షణమే పూడ్చి వేయాలని ప్రయాణికులు, ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ప్రమాదాల నుంచి కాపాడాలి



సరంపేట నుంచి ఇందుర్తికి వెళ్లే దారిలో పిచ్చిమొక్కలు దట్టంగా పెరగడంతో రోడ్డు పక్కన ఉన్న బావులు కనిపించడం లేదు. అక్కడే మూలమలుపులు ఉన్నాయి. ఎదురుగా వచ్చే వాహనం సమీపంలోకి వచ్చే వరకు కనిపించదు. సూచిక బోర్డులు ఏర్పాటు చేసి ప్రమాదాల నుంచి కాపాడాలి.
–వీసం సుందర్, సరంపేట

కార్యదర్శులకు ఆదేశాలు జారీచేస్తాం



ప్రమాదకరంగా ఉన్న పాత బావులను పరిశీలించి రక్షణ వలయాలు ఏర్పాటు చేయడం, లేదంటే రైతులతో మాట్లాడి సమస్యకు పరిష్కారం చూపాలని పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేస్తాం. రోడ్డు వేసేటప్పుడు బావులు, వంతెనలు ఉన్న చోట సూచిక బోర్డులు ఏర్పాటు చేయాల్సి ఉంటుంది.
–జి.వెంకటేశ్వర్‌రావు, ఎంపీడీఓ

మునుగోడులో మరోసారి గులాబీ జెండా ఎగరాలి



ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, చిత్రంలో ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి

చండూరు : వచ్చే ఎన్నికల్లో మునుగోడు గడ్డపై మరోసారి గులాబీ జెండా ఎగరాలని రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్య యాదవ్ అన్నారు. బుధవారం కొండాపురం, పుల్లెంల, దోనిపాముల, బంగారిగడ్డ ఎంపీటీసీల పరిధి గ్రామాల ఆత్మీయ సమ్మేళనం అంగడిపేటలోని ఓ ఫంక్షన్ హాల్‌లో జరిగింది. సమ్మేళనానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ మునుగోడు ఉప ఎన్నికలో భాగంగా ఇచ్చిన హామీల ప్రకారం నియోజకవర్గంలో సుమారు రూ.600 కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామన్నారు. జెడ్పీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ కార్యకర్తలు ప్రభుత్వ పథకాలను ప్రజల వద్దకు తీసుకుపోవాలన్నారు. ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో నా బలం.. బలగం మీరేనని ప్రజలనుద్దేశించి అన్నారు. గట్టుప్పల నుంచి కొండ మల్లేపల్లి వరకు డబుల్ రోడ్డుకు రూ.90 కోట్ల నిధులు మంజూరు కాబోతున్నాయని తెలిపారు. వెలమకన్నె ఫీడర్ చానల్, శేషిలేటి వాగు ఫీడర్ ఛానల్ పనులు మొదలు కాబోతున్నాయని వివరించారు. ఈ సమ్మేళనంలో ఎంపీపీ పల్లె కళ్యాణిరవికుమార్, మున్సిపల్ చైర్‌పర్సన్ తోకల చంద్రకళవెంకన్న, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు బొమ్మరబోయిన వెంకన్న, కోడి వెంకన్న, మునగాల నారాయణరావు, వేనేపల్లి వెంకటేశ్వర్‌రావు, గుర్రం వెంకట్‌రెడ్డి, కురుపాటి సుదర్శన్, ఉజ్జిని అనిల్‌రావు, మధుసూదన్ రావు, పెండ్యాల గీత తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

చండూరు మున్సిపాలిటీలోని ఖబరస్థాన్‌లో రూ.10 లక్షలతో పనులకు మునుగోడు ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ తోకల చంద్రకళవెంకన్న, వైస్ చైర్‌పర్సన్ దోటి సుజాతవెంకన్న, కౌన్సిలర్లు యాదయ్య, కోడి వెంకన్న, శేఖర్, వెంకటేశం, మంగమ్మ గిరిధర్, సంజయ్, రాధిక, కోఆప్షన్ సభ్యులు ఖైరు బేగం, ముజహిద్దిన్, నగేష్ కమిషనర్ ఖాజా మొయినుద్దీన్, ఎంపీడీఓ యాకూబ్ నాయక్, జిన్నా, హైమద్ తదితరులు పాల్గొన్నారు.

కార్యదర్శులను రెగ్యులరైజ్ చేయాలి



చిట్యాల : వినతి పత్రం అందజేస్తున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులు

చిట్యాల : తమ సర్వీస్‌ను రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ చిట్యాల మండలంలోని జూనియర్ పంచాయతీ కార్యదర్శులు బుధవారం ఎంపీడీఓ బి.లాజర్, ఎంపీఓ పద్మకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్యదర్శులు మాట్లాడుతూ తమను రెగ్యులరైజ్ చేయకుంటే ఈ నెల 28వ తేదీ నుంచి సమ్మెకు వెళ్తామని తెలిపారు.

నార్కట్‌పల్లి : ప్రొబేషన్ కాలం పూర్తికావడంతో తమను రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ మండలంలోని జూనియర్ పంచాయతీ కార్యదర్శులు బుధవారం ఎంపీపీ సూదిరెడ్డి నరేందర్‌రెడ్డి, ఎంపీడీఓ యాదగిరి, ఎంపీఓ సత్యనారాయణలకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నరేష్, అలెందర్, శ్రీకాంత్, రాంబాబు, రామస్వామి, గీతాంజలి, రాణి, స్వరూప తదితరులు ఉన్నారు.

మర్రిగూడ : తమను రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ మండలంలోని పలువురు జూనియర్ పంచాయతీ కార్యదర్శులు బుధవారం ఎంపీడీఓ జె.వెంకటేశ్వర్‌రావు, ఎంపీఓ ఝాన్సీలకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు నాగమణి, శిరీష, పద్మ, మౌనిక, లక్ష్మీ, పార్వతి, ఉమాదేవి, గీత, ప్రణీత, రాకేష్, షకీర్, బాబు, వెంకన్న, లింగస్వామి, మల్లేష్‌లు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రైతు సంఘం ఆవిర్భావ దినోత్సవం

చండూరు : నెర్మట గ్రామంలో అఖిల భారత కిసాన్ సభ (ఏఐకేఎస్) 88వ ఆవిర్భావ దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. సీపీఎం మండల కార్యదర్శి మొగుదాల వెంకటేశం, సహాయ కార్యదర్శి జెర్రిపోతుల ధనంజయ గౌడ్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యుడు బొమ్మరగోని కిరణ్, యాదయ్య, ఈరగట్ల స్వామి, శంకరయ్య, బుర్కల స్వామి, కొత్తపల్లి వెంకన్న, మాధురి, సరస్వతి, లక్ష్మమ్మ, లింగమ్మ, పాల్గొన్నారు.

చిట్యాల : మండలంలోని ఆరెగూడెం గ్రామంలో బుధవారం రైతు సంఘం ఆవిర్భావ దినోత్సవాన్ని ఆ సంఘం నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జెండాను మండల అధ్యక్షుడు లడే రాములు ఎగురవేశారు. దొడ్డి అంజయ్య, లడే శ్రీను, దొడ్డి రవి, వెంకన్న, మారయ్య, లింగయ్య, నర్సింహ పాల్గొన్నారు.

మైనార్టీల సంక్షేమానికి పెద్దపీట



ఇఫ్తార్ విందులో పాల్గొన్న చైర్మన్ సైదిరెడ్డి

నల్లగొండ టూటౌన్ : మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి అన్నారు. బుధవారం నల్లగొండ పట్టణంలోని 17వ వార్డు ఆర్జాలబావిలో ముస్లింలకు ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పవిత్రమైన రంజాన్ పండుగకు తోఫా అందజేసి ప్రభుత్వం ముస్లింలను గౌరవిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో ముస్లిం మతపెద్దలు పాల్గొన్నారు.

వేముల నాగయ్యకు నివాళి

నల్లగొండ టౌన్ : కల్లుగీత కార్మికుల హక్కుల కోసం పోరాడిన నేత వేముల నాగయ్య అని తెలంగాణ చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ గంజి మురళీధర్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి నారి అయిలయ్య అన్నారు. బుధవారం వేముల నాగయ్య ఏడో వర్ధంతి సందర్భంగా స్థానిక దొడ్డి కొమరయ్య భవన్‌లో నాగయ్య చిత్రపటానికి వారు పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బండా శ్రీశైలం, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య, పరిపూర్ణాచారి, దండెంపల్లి సరోజ, సాజిద్, రవీంద్రకుమార్, సత్యనారాయణ, రాములు, కిరణ్, అంజయ్య పాల్గొన్నారు.

కనగల్‌లో..

కనగల్ : సీపీఎం నాయకుడు వేముల నాగయ్య 7వ వర్ధంతి సందర్భంగా బుధవారం మండల కేంద్రంలోని ఆయన స్తూపం వద్ద సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యురాలు పాలడుగు ప్రభావతి, జిల్లా కమిటీ సభ్యుడు దండెంపల్లి సత్తయ్య, మండల సహాయ కార్యదర్శి కానుగు లింగస్వామి, పాలే సత్యనారయణ, లింగయ్య, అక్రం, సుల్తానా, లక్ష్మమ్మ, రాంబాబు, కుటుంబ సభ్యులు వేముల సాయమ్మ, రమేష్ పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే సీఎం కేసీఆర్ ధ్యేయం



వెలిమినేడులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, పక్కన ఎంపీ బడుగుల

చిట్యాల : ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న సీఎం కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్‌ఎస్ పార్టీని మరోమారు అధికారంలోకి తీసుకొచ్చేందుకు నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు కలిసికట్టుగా పనిచేయాలని నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య కోరారు. చిట్యాల మండలం వెలిమినేడు గ్రామంలో బుధవారం నిర్వహించిన బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనానికి రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్‌తో కలిసి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ నెల 14వ తేదీన హైదరాబాద్‌లో అంబేద్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఎంపీ బడుగుల లింగయ్య మాట్లాడుతూ సీఎం కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం దేశానికి రోల్ మోడల్‌గా మారిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కొలను సునిత, జెడ్పీటీసీ సుంకరి ధనమ్మ, ఏఎంసీ చైర్మన్ జడల ఆదిమల్లయ్య, చిట్యాల మున్సిపల్ చైర్మన్ కోమటిరెడ్డి చినవెంకట్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ రుద్రారపు భిక్షం, కో ఆప్షన్ సభ్యుడు మోసిన్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ఆవుల అయిలయ్య, ప్రధాన కార్యదర్శి కల్లూరి మల్లారెడ్డి, మహిళా, కార్మిక, యువజన విభాగం మండల అధ్యక్షులు చెర్కుపల్లి శశిరేఖ, కొలను సతీష్, తుమ్మల నాగరాజురెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు భీష్మారెడ్డి, సత్తిరెడ్డి, అర్రూరి శ్రీశైలం, నర్సింహ గౌడ్, యాదగిరి పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ ఎల్‌ఓసీ అందజేత

కేతేపల్లి : గుడివాడ గ్రామానికి చెందిన కట్ట యాదమ్మకు మంజూరైన రూ.3 లక్షల సీఎంఆర్‌ఎఫ్ ఎల్‌ఓసీ పత్రాన్ని నకిరేకల్‌లో ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అందజేశారు. ఏఎంసీ చైర్మన్ కొప్పుల ప్రదీప్‌రెడ్డి, జెడ్పీటీసీ స్వర్ణలతసురేష్, సర్పంచ్‌లు శ్రీనివాస్‌యాదవ్, శ్రవణ్, ఎంపీటీసీ యాదవరెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మారం వెంకట్‌రెడ్డి, చిమట వెంకన్న పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమ్మె నోటీసు



సమ్మె నోటీసు అందజేస్తున్న కార్మిక సంఘాల జేఏసీ నాయకులు

నల్లగొండ టూటౌన్ : తమకు రావాల్సిన 11వ పీఆర్సీ బకాయిలు ఈ నెల 25వ తేదీ నాటికి చెల్లించకపోతే 26 నుంచి నిరవధిక సమ్మె చేస్తామని సీఐటీయూ, ఐఎన్‌టీయూసీ, బీఆర్‌టీయూ ఆధ్వర్యంలో నీలగిరి మున్సిపల్ కార్మికులు బుధవారం మున్సిపల్ కమిషనర్ కేవీ. రమణాచారికి సమ్మె నోటీస్ అందజేశారు. అనంతరం మున్సిపల్ కార్మిక సంఘాల జేఏసీ బాధ్యుడు దండెంపల్లి సత్తయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 2021 జూన్ నుంచి పెరిగిన వేతనాలు అమలు చేస్తామని జీఓ 60 జారీ చేసిందన్నారు. పెరిగిన వేతనాల ఏరియర్స్ ఇవ్వాలని అనేకమార్లు అధికారులకు విజ్ఞప్తి చేసినా నేటికీ ఇవ్వలేదన్నారు. ఎమ్మెల్యే, మున్సిపల్ పాలకవర్గం జోక్యం చేసుకొని వెంటనే కార్మికులకు బకాయిలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు సుంకిశాల వెంకన్న, ఎండీ. అబ్దుల్ లతీఫ్, పేర్ల సంజీవ, పేర్ల వెంకన్న, పెరిక కళ్యాణ్, పెరిక కృష్ణ, పందుల లింగయ్య, వెంకన్న, నర్సింహ, లక్ష్మణ్, చందు, రామలింగయ్య తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకు డిజిటల్ సేవలపై అవగాహన

కనగల్ : బ్యాంకులు అందిస్తున్న డిజిటల్ సేవలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని పంజాబ్ నేషన్ బ్యాంకు మేనేజర్ చిన్నం శ్రీను అన్నారు. బుధవారం మండల పరిధిలోని చెట్లచెన్నారం గ్రామంలో బ్యాంకు 129వ ఫౌండేషన్ వార్షిక వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా మేనేజర్ మాట్లాడుతూ సైబర్ నేరగాళ్ల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం బ్యాంకు అందిస్తున్న సేవలు, రుణాలు, సదుపాయాలపై కళాబృందం అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గన్నెబోయిన గంగమ్మచంద్రయ్య, ఫీల్డ్ ఆఫీసర్ నవీన్, రమేష్‌రెడ్డి పాల్గొన్నారు.

అంబేద్కర్ జయంతి పోస్టర్ విడుదల

చిట్యాల : ఈ నెల 14వ తేదీన చిట్యాలలో జరిగే డాక్టర్ బీఆర్.అంబేద్కర్ జయంతి వేడుకలను జయప్రదం చేయాలని కోరుతూ బుధవారం చిట్యాలలో ప్రచార పోస్టర్‌లను బీఎస్పీ నాయకులు విడుదల చేశారు. బీఎస్పీ మండల ప్రధాన కార్యదర్శి మేడి రాజు, గ్యార శేఖర్, బాకి శంకర్ ప్రసాద్, మేడి కార్తీక్, వినయ్, మల్లేష్, రమేష్ పాల్గొన్నారు.



పోస్టర్ విడుదల చేస్తున్న బీఎస్పీ నాయకులు

పాలిటెక్నిక్ కళాశాలలో యోగా శిక్షణ

నల్లగొండ టౌన్ : హార్ట్‌ఫుల్‌నెస్ మెడిటేషన్, రామచంద్రమిషన్ ఆధ్వర్యంలో నల్లగొండ పట్టణంలోని పాలిటెక్నిక్ కళాశాలలో బుధవారం 2వ రోజు యోగా ట్రైనర్ రాజశేఖర్‌రెడ్డి విద్యార్థులకు యోగా శిక్షణ ఇచ్చారు. హార్ట్‌ఫుట్‌నెస్ క్లీనింగ్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించి మెడిటేషన్ చేయించారు. ప్రిన్సిపాల్ జానకీదేవి, కోఆర్డినేటర్ శ్రీరామదాసు, వెంకటాచారి, జోగారెడ్డి పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

నల్లగొండ రూరల్ : నల్లగొండ మండలంలోని దోనకల్ గ్రామంలో అనారోగ్యంతో మృతిచెందిన కొత్తపల్లి కాషయ్య చిత్రపటానికి బుధవారం ఆర్‌కేఎస్ ఫౌండేషన్ చైర్మన్ పిల్లి రామరాజుయాదవ్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబానికి రూ.10 వేల ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో కొత్తపల్లి శ్రీను, నర్సింహ, ప్రశాంత్, దానయ్య, యేసయ్య, భిక్షం, రాములు, అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు ఆస్పత్రికి రూ.6 .87 లక్షల కరెంటు బిల్లు

నకిరేకల్ : మున్సిపాలిటీ కేంద్రంలోని ఆఫీసర్స్ కాలనీలో గల ఓ ప్రైవేటు ఆస్పత్రికి ఏప్రిల్ మాసం కరెంటు బిల్లు రూ.6,87973 వచ్చింది. బిల్లు చూసిన సదరు హాస్పిటల్ డాక్టర్ శ్రీనాథ్ స్థానిక విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అప్రమత్తమైన విద్యుత్ అధికారులు బిల్ మిషన్‌లో సాంకేతిక లోపం వల్ల పొరపాటు జరిగినట్లు గుర్తించారు. డాక్టర్ ఫిర్యాదు మేరకు ఆ బిల్లును తొలగించామని ఏఈ సాయి గణేశ్ తెలిపారు.

దళారులకు ధాన్యం విక్రయించి మోసపోవద్దు



తిప్పర్తి మండలంలోని జంగారెడ్డిగూడెంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి



కట్టంగూర్‌లో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చిరుమర్తి

- ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్‌రెడ్డి, చిరుమర్తి లింగయ్య

కట్టంగూర్ : రైతులు ఆరుగాలం కష్టించి పండించిన ధాన్యాన్ని దళారులకు విక్రయించి మోసపోవద్దని నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. బుధవారం మండలంలోని అయిటిపాముల గ్రామంలో ఐకేపీ కేంద్రాన్ని, కట్టంగూర్, కల్మెర, మునుకుంట్ల గ్రామాల్లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఏ గ్రేడ్ రకం ధాన్యం క్వింటాలుకు రూ.2060, బి గ్రేడు రకం ధాన్యం క్వింటాలుకు రూ. 2040 చెల్లిస్తారని తెలిపారు. అదేవిధంగా కట్టంగూర్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో మండలంలోని పలుగ్రామాలకు చెందిన 154 మందికి రూ.1.50 కోట్ల విలువ చేసే కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు, 28 మందికి సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా మంజూరైన రూ.10.50 లక్షల విలువ గల చెక్కులు అందజేశారు. ఈదులూరు గ్రామంలో ఎస్‌జీఎఫ్ నిధులు రూ.20లక్షలతో నిర్మించే సీసీ రోడ్లకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఈదులూరుకు చెందిన పలు పార్టీల నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీపీ జెల్లా ముత్తిలింగయ్య, జెడ్పీటీసీ తరాల బలరాములు, వైస్ ఎంపీపీ గడుసు కోటిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ నూక సైదులు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పోగుల నర్సింహ, తహసీల్దార్ దేశ్యానాయక్, సీఈఓ మల్లారెడ్డి, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఏపీఎం వినోద, ఎస్ఆర్‌పీ స్వాతి, నకిరేకంటి నర్సింహ పాల్గొన్నారు.

కేతేపల్లి మండలంలో..

కేతేపల్లి : ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య కోరారు. మండలంలోని కాసనగోడు, బొప్పారం, కొత్తపేట గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. నకిరేకల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల ప్రదీప్‌రెడ్డి, కేతేపల్లి జెడ్పీటీసీ బొప్పని స్వర్ణలతసురేష్, ఎంపీడీఓ రమేష్ దీన్‌దయాళ్, ఏపీఎం బి.యాదమ్మ, శాంత, ఎంపీటీసీ బుర్రి యాదవరెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ పి.సుధాకర్‌రెడ్డి, సర్పంచులు బడుగుల శ్రీనివాస్‌యాదవ్, కర్ర ప్రభాకర్‌రెడ్డి, చల్ల పూలమ్మ కృష్ణారెడ్డి, బచ్చు జానకిరాములు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మారం వెంకట్‌రెడ్డి, చిమట వెంకన్న, రైతులు పాల్గొన్నారు.

తిప్పర్తి మండలంలో..

రామగిరి(నల్లగొండ) : తెలంగాణపై కేంద్ర ప్రభుత్వం కుట్ర కట్టిందని నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం తిప్పర్తి మండలంలో పీఏసీఎస్, ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యానికి మద్దతు ధర కల్పించి ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందన్నారు. కొనుగోలు కేంద్రాలకు లారీలు, గన్నీ బ్యాగుల కొరత లేకుండా చూస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ పాశం సంపత్‌రెడ్డి, వైస్ చైర్మన్ కందుల రేణుకలక్ష్మయ్య, ఎంపీపీ నాగులవంచ విజయలక్ష్మిలింగారావు, వైస్ ఎంపీపీ ఏనుగు వెంకట్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పల్‌రెడ్డి రవీందర్‌రెడ్డి, సెక్రటరీ వనపర్తి నాగేశ్వర్‌రావు, రైతుబంధు మండల కన్వీనర్ ముత్తినేని శ్యామ్‌సుందర్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, రైతులు పాల్గొన్నారు.

మాడుగులపల్లి మండలంలో..

మాడుగులపల్లి : అన్నదాతల సంక్షేమానికి అనేక పథకాలు అమలు చేస్తున్న సీఎం కేసీఆర్.. రైతు పక్షపాతిగా నిలిచారని నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి అన్నారు. మాడుగులపల్లి మండల కేంద్రంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ఆయన ప్రారంభించి మాట్లాడారు. కొనుగోళ్లు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ శ్రీవిద్యరాజు, వైస్ ఎంపీపీ సుమలత శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్ తూనం శోభరవి, వేములపల్లి, తిప్పర్తి పీఏసీఎస్ చైర్మన్లు రాములుగౌడ్, పాశం సంపత్‌రెడ్డి, కట్టా సిద్ధార్థరెడ్డి, వెన్న శ్రవణ్‌రెడ్డి, వివేక్ రెడ్డి, కందిమళ్ల నరేందర్‌రెడ్డి, ఎంపీడీఓ జితేందర్ రెడ్డి, ఏఈఓ దేవ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు రోజుకు రూ.600 వేతనం చెల్లించాలి



సమస్యలు తెలుసుకుంటున్న నాయకులు

కేతేపల్లి : పెరుగుతున్న నిత్యావసర ధరలకు అనుగుణంగా ఉపాధి హామీ కూలీలకు రోజుకు రూ.600 వేతనం ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బొజ్జ చినవెంకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలకేంద్రంలో ఉపాధి హామీ కూలీలు చేస్తున్న పనులను బుధవారం ఆయన పరిశీలించి వారి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ పని చేసేచోట సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. సంఘం మండల అధ్యక్షుడు సీహెచ్.లూర్దుమారయ్య, సొడయ్య, పెద మల్లయ్య, మారయ్య, వెంకన్న పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు వినతి

చిట్యాల : రేషన్ దుకాణాల ద్వారా లబ్ధిదారులకు నాణ్యమైన బియ్యం సరఫరా చేయాలని కోరుతూ బుధవారం చిట్యాల మున్సిపాలిటీ సీపీఐ కార్యదర్శి ఎస్‌కే.షరీఫ్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు తహసీల్దార్ జక్కర్తి శ్రీనివాసులుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా షరీఫ్ మాట్లాడుతూ మండలంలోని రేషన్ దుకాణాలకు ముక్కిపోయి రంగు మారిన బియ్యం సరఫరా చేస్తున్నారని ఆరోపించారు. జిల్లా సత్యం, బొల్గూరి లింగయ్య, మేకల భిక్షం పాల్గొన్నారు.